క్లుప్తంగా

నేడు స్పందన

పూతలపట్టు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

వినాయకున్ని దర్శించుకున్న చిత్తూరు డీఎస్పీ



డీఎస్పీ రాజగోపాల్ రెడ్డికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్, సీఐ, ఎస్ఐ

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు వచ్చిన ఆయనకు చైర్మన్ మోహన్ రెడ్డి స్వాగతం పలికి స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులతో ఆశీర్వచనం ఇప్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో చిత్తూరు వెస్ట్ సీఐ రవి శంకర్ రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు, ఆలయ ఏఈవో విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా రేపు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాలలో ఈ నెల 6వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల చైర్మన్ శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు తమ కళాశాలలో వివిధ బహుళజాతి కంపెనీల ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా జరుగుతుందని చెప్పారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు, తృతీయ సంవత్సరం చదువుతున్న వారు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9493210966 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చిత్తూరు అర్బన్ : నగరంలోని సీఎం కల్యాణ మండపం వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో పలమనేరు నుంచి వస్తున్న టాటా ఏస్ వాహనం, చిత్తూరు నుంచి అటు వైపు వెళ్తున్న ఐచర్ వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పలమనేరుకు చెందిన చిట్టి, మహమ్మద్, అహ్మద్‌కు గాయాలయ్యాయి. వెంటనే ఆ ముగ్గురిని 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం వారిని తిరుపతి జిల్లా స్విమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తున్నాం



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: గ్రామాల్లో ప్రజా సమస్యలు తెలుసుకుని వెంటనే వాటిని పరిష్కరిస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండలంలోని పాపేపల్లెలో జెడ్పీ నిధులతో సీసీ రోడ్డు వేస్తున్నారు. ఆదివారం ఆ పనులను జెడ్పీ చైర్మన్ పరిశీలించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. త్వరితగతిన సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మోహన్‌రాజు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై త్వరలో వైద్య శిబిరం



మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్

పుంగనూరు: రొమ్ము క్యాన్సర్‌పై త్వరలో వైద్య శిబిరం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మానవత సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. ఆదివారం కార్యవర్గ సభ్యులకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. మహిళల్లో రొమ్ము క్యాన్సర్ కేసులు పెరిగిపోతున్నాయని, ఓ అధ్యయనంలో తేలిందని, అందుకే ఈ పర్యాయం ఈ శిబిరం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఇదలా ఉంచితే, సంస్థకు 10 సెంట్ల భూమిని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కేటాయించారని కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పేద ప్రజల కోసం వైకుంఠ రథం, ఫ్రీజర్ బాక్సులు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నందీశ్వరయ్య, ఏసి.నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, మునస్వామి నాయుడు, రామనాథం, భక్తవత్సలం, రాజు, రెడ్డెప్పరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటేశు, హరినాథరెడ్డి, అనిల్‌కుమార్, చెంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభను విజయవంతం చేద్దాం

- అనంతపురం జిల్లాలో 10న సిద్ధం సభ
- 9న చిత్తూరు నుంచే బయలుదేరుదాం
- చిత్తూరు సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: అనంతపురం జిల్లాలో ఈనెల 10న జరగనున్న సిద్ధం కార్యక్రమానికి పార్టీ క్యాడర్, కార్యకర్తలు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. ఆయన కార్యాలయంలో ఆదివారం నగర పార్టీ క్యాడర్‌తో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రానున్న 60 రోజుల్లో జరిగే ఎన్నికలకు ఎలా సిద్ధం కావాలనే అంశంపై సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేస్తారన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో రెండు బస్సుల్లో కార్యకర్తలు, గృహసారథులు, అభిమానులు వెళ్లేలా చూడాలన్నారు. ముందుస్తుగా కార్యక్రమానికి వచ్చే వారి వివరాలను తెలియజేయాలన్నారు. 9న నియోజకవర్గంలోని సంబంధిత సచివాలయాల నుంచి అంతా బయలుదేరాలని సూచించారు. మార్గమధ్యలో బస ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం ఆయన నగర పరిధిలోని వరదరాజులపల్లెలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు టిమ్ము, టౌన్‌బ్యాంకు చైర్మన్ రాంగణేష్, కార్పొరేటర్లు, కోఆప్షన్ మెంబర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్

స్థానిక పంత్రాంపల్లెలో దాతలు, చిత్తూరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆధ్వర్యంలో వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం వాటిని విజయానందరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. దాతలు స్థలం, భవనం ఇస్తే తాను మిషనరీ, ఇతర ఖర్చులు సమకూర్చినట్లు అన్నారు. పంత్రాంపల్లెలో వైఎస్సార్‌సీపీకి ఆదరణ బాగుందని, స్థానిక సమస్యలను పరిష్కరించడానికి అధికార యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ చిత్తూరు రూరల్ అధ్యక్షుడు త్యాగ, యాదమరి ఎంపీపీ సురేష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక చవటపల్లె దుర్గమ్మ ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వేలు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నుంచి 40 మంది కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ 80 శాతం పూర్తి



టి.పుత్తూరు సచివాలయంలో రిజిస్ట్రేషన్లను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో రమణప్రకాష్

తవణంపల్లె : మండలంలో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ 80 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో రమణప్రకాష్ తెలిపారు. ఆయన ఆదివారం టి.పుత్తూరు, తవణంపల్లె, దిగువమాఘం, జొన్నగురకల తదితర సచివాలయాలను పరిశీలించారు. సచివాలయల్లో ఇంటి పట్టాలను రిజిస్ట్రేషన్ పనులను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

సాంకేతిక లోపం ఉన్నప్పటికీ లబ్ధిదారులను పిలిపించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు వలంటీర్లతో ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేయాలన్నారు. అదే విధంగా కుల గణన సర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి నివాళి





నివాళులర్పిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్, నాయకులు, (ఇన్‌సెట్) గుండెపోటుతో మృతి చెందిన వెంకటేష్

బంగారుపాళెం: మండలంలోని కాటప్పగారిపల్లె పంచాయతీ ఎద్దులవారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల నాయకుడు వెంకటేష్‌కు పలువురు నాయకులు నివాళులర్పించారు. ఆయన ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్, రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్ రాజా, పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు గ్రామానికి చేరుకుని వెంకటేష్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. చిన్న వయసులోనే వెంకటేష్ మృతి చెందడం బాధాకరమన్నారు.

ఘనంగా మేరీమాత రథోత్సవం



రథోత్సవం



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో ఆదివారం మేరిమాత, జాన్‌బాస్కో రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పలమనేరు రోడ్డులోని జాన్‌బాస్కో చర్చిలో గత పది రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. చివరి రోజు మేరిమాతా, జాన్‌బాస్కో రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ఉదయం దివ్యబలి పూజను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అనంతరం రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి మేరీమాతా, జాన్‌బాస్కో ప్రతిమను ఊరేగించారు. ఈ ఊరేగింపు చర్చి నుంచి ఎంఎస్ఆర్ సర్కిల్, గాంధీ విగ్రహం, చర్చి వీధి మీదుగా దర్గా సర్కిల్ వరకు కనుల పండువగా నిర్వహించారు. పాస్టర్లు మరియన్న, వరప్రసాద్, ప్రకాష్, మనోహర్, అనిల్, రమేష్, స్టార్జినా, మేరీ, జెస్సీ, జాన్సీ, లక్ష్మీ క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయరూ!

- ఎంపీకి వినతి

చౌడేపల్లె: మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎంపీ మిథున్‌రెడ్డిని చిత్తూరు, రాజంపేట పార్లమెంట్ సెగ్మెంట్ వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు కోరారు. ఆదివారం విజయవాడలో ఎంపీని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. చౌడేపల్లెలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో పుంగనూరు, మదనపల్లె, పలమనేరు తదితర ప్రాంతాలకు విద్యార్థులు ఇబ్బందుల నడుమ వెళ్లాల్సి వస్తోందని నివేదించారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

ఒంటరి ఏనుగు హల్‌చల్

- కారు, ఆవుపై దాడి

శాంతిపురం: మండలంలోని కోనేరుకుప్పం, ఎస్ గొల్లపల్లె ప్రాంతంలో ఆదివారం ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. కోనేరుకుప్పానికి చెందిన ఉమాశంకర్‌రెడ్డి కారులో వడ్డివానికొత్తూరు వైపు వెళ్తుండగా ఏనుగు రోడ్డులో దాడి చేసింది. కారు బంపర్‌ను పాక్షికంగా ధ్వంసం చేసింది. హారన్ మోగిస్తూ కేకలు వేయడంతో ఏనుగు పొదల్లోకి వెళ్లిపోయింది. అలాగే అదే గ్రామానికి చెందిన ప్రసాద్ ఆచారి ఆవుపై దాడి చేసి స్వల్పంగా గాయపరచింది. విషయం తెలుసుకున్న డీఆర్‌ఓ పుల్లయ్య, అటవీశాఖ సిబ్బంది అక్కడికి చేరుకునేసరికి ఏనుగు ఓ మామిడి తోటలో మకాం వేసింది. కర్ణాటక అడవుల నుంచి గుంపును విడిపోయి ఇది వచ్చి ఉండొచ్చని ఒంటరి ఏనుగు గురించి అధికారులు భావిస్తున్నారు. మళ్లీ దానిని వెనక్కు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

వేమన పద్యాల్లో ఆత్మజ్ఞానం

పలమనేరు: వేమన పద్యాల్లో ఆత్మజ్ఞానం ఇమిడి ఉందని స్థానిక త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార నిర్వాహకులు భాస్కర్ పేర్కొన్నారు. పట్టణంలోని ఇంద్రానగర్‌లో ఆదివారం వేమన పద్యాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, వేమన మానవులకు తన పద్యాలతో ఎంతో నీతిని ఆనాడే చాటిచెప్పారన్నారు. వేమన పద్యాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. అనంతరం ఆధ్యాత్మిక పుస్తకాలను ప్రజలకు పంపిణీ చేశారు. సమితి సభ్యులు రాజేంద్ర, జీవరత్న, వాణిశ్రీ, జ్యోతి, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో పడిగాపులు

- వైఎస్సార్ సీపీ పాలనలో ఇళ్ల ముంగిటే పింఛన్లు
- టీడీపీ పాలనలో పింఛను పొందడం గగనమే
- ప్రస్తుతం రోజుల వ్యవధిలోనే మంజూరు



కుర్మాయిలో నాడు పింఛన్ల కోసం పడిగాపులు పడుతున్న పింఛనుదారులు(ఫైల్)



సర్వర్ పనిచేయక అర్ధరాత్రి దాకా పింఛను కోసం వేచి ఉన్న రోజులవి(ఫైల్)



సముద్రపల్లె వృద్ధునికి ఇంటివద్దకే వెళ్లి పింఛను ఇస్తున్న సచివాలయ సిబ్బంది

పలమనేరు: గత తెలుగుదేశం పార్టీ హయాంలో సామాజిక పింఛన్లు పొందాలంటే వృద్ధులు, వికలాంగులకు కష్టాలు తప్పేవికాదు. పంచాయతీలోని వివిధ గ్రామాల లబ్ధిదారులు పోస్టాఫీసుకు వెళాల్సి వచ్చేది అక్కడ ఆన్‌లైన్ పనిచేయకపోతే ఉస్సూరంటూ తిరిగి ఇళ్లకు వచ్చేవారు. ఆపై గ్రామాల్లో పింఛను ఇచ్చేందుకువెళ్లినా సర్వర్ లేని కారణంగా లబ్ధిదారులకు ఇక్కట్లు తప్పేవికావు. నెలలో తొలిరోజు ఇవ్వాల్సిన పింఛన్లు 15 రోజులు గడిచినా చేరేవికాదు. ముఖ్యంగా వికలాంగులు, వృద్ధులు బైక్‌లపై, ఆటోల్లో పింఛను ఇచ్చే ప్రదేశానికి వ్యయప్రయాలకోర్చి వెళ్లేవారు. కొందరు ఆకలితో అలమటించిన సందర్భాలు అనేకం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఈ ఇక్కట్లు లేకుండా చేసింది. నేరుకు ఒకటోతేదీనే వలంటీర్లు తెల్లారముందు ఇళ్లకు వెళ్లి, నిద్ర లేపి, మరీ పింఛన్లు ఇస్తున్నారు.! అది కూడా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన ప్రకారం నెలకు మూడువేలు అందజేస్తున్నారు. ఎవరైనా అనారోగ్యంతో దూరప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో ఉన్నప్పటికీ వలంటీర్ల అక్కడికే వెళ్లి వారికి పింఛన్లు ఇస్తున్నారు. పింఛన్ల పంపిణీ స్వరూపాన్ని సమూలంగా మార్చివేయడంతోనే ఇది సాధ్యమైంది. అంతేకాదు; కోవిడ్ కష్టకాలంలోనూ సామాజిక పింఛనుదారులకు ఇళ్లకు వెళ్లి పింఛన్లు సైతం ప్రభుత్వం అందేలా చేసింది.

నాయనా! ఇప్పుడే ఇబ్బందులూ లేవ్



నాయనా.. చెంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పింఛను తీసుకునేదానికి చానా ఇబ్బందులు పడినాం. చెప్పిన టయానికి పింఛను ఇచ్చేవాళ్లు కాదు.. ఆ ఇచ్చే డబ్బు ఆటోలకు, భోజనం మొదలైన వాటికి కొంత పోయేది. అదేదో సర్వరంట.. అది ఎప్పుడు పనిచేస్తాదో అప్పడే పింఛనిచ్చేవాళ్లు. లేదంటే పింఛన్లు వస్తుందనే గ్యారెంటీ లేదు. జగన్ ప్రభుత్వం వచ్చినాక వలంటీర్లే ఇళ్లకాడికొచ్చి పింఛన్లు ఇస్తాండారు. జగన్ మూడువేలు ఇస్తాడంట అంటే ఎవరూ నమ్మలేదు. ఇప్పుడు మూడు వేలు ఇస్తుంటే ఓర్వలేకపోతాండారు. నా బిడ్డలకంటే జగన్ బిడ్డ బాగుండాలని ఆశీర్వదిస్తున్నా.

–రాజమ్మ, కొత్తబూరగపల్లె, పెద్దపంజాణి మండలం

ఆడుదాం ఆంధ్రా క్రీడాకారులకు అభినందనలు



బోడబండ్లలో క్రీడాకారులను అభినందిస్తున్న గ్రామస్తులు

బంగారుపాళెం : ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన బోడబండ్ల వాలీబాల్ మహిళా జట్టు సభ్యులను ఆదివారం గ్రామస్తులు అభినందించారు. వారు నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలోనూ, జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. స్థానిక కోదండరామస్వామి ఆలయం వద్ద ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి క్రీడాకారులకు శాలువాలు కప్పి అభినందించారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి గ్రామానికి మంచి పేరు తీసుకువచారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నరసింహులు, పట్టాభి, గిరి, జగదీష్‌యాదవ్, మోహన్, చిరంజీవి, జ్యోతీశ్వర్‌నాయుడు, గోపినాయుడు, ఉదయ్, గోపి, హరికృష్ణ, గుణ, దినేష్, వెంకటేష్, లీలాప్రసాద్, గజేంద్ర, వేణు పాల్గొన్నారు.

జలకంఠేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



జలకంఠేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

బంగారుపాళెం: మొగిలి శివాలయం అనుబంధ దేవరకొండ జలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా ఉదయం పార్వతీ సమేత జలకంఠేశ్వరస్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ నెల 23వ తేదీన పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేపడతామని నిర్వాహకులు తెలిపారు.

వృత్తి విద్యలోనూ రాణించాలి



మోడల్ స్కూల్ విద్యార్థులకు విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఏఈ రాంప్రసాద్ రెడ్డి

- విద్యుత్ వినియోగంపై విద్యార్థులకు అవగాహనలో ట్రాన్స్‌కో ఏఈ

రొంపిచెర్ల: విద్యార్థులు సాధారణ విద్యతోపాటు వృత్తి విద్యలోనూ రాణించాలని ట్రాన్స్‌కో ఏఈ రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విద్యుత్ వినియోగంపై మోడల్ స్కూల్ విద్యార్థులకు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ విద్యుత్ వినియోగం పెరుగుతోందన్నారు. విద్యుత్ ఉత్పత్తి, వినియోగం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. విద్యుత్‌ను దుబారాగా వినియోగించరాదని, ఎంతవరకు అవసరమో అంతవరకే వాడాలన్నారు. 11–33 సబ్ స్టేషన్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సరళ, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ మీనాక్షి, వృత్తి విద్యా శిక్షకులు వినోద్‌కుమార్, మహ్మద్ ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ కిటకిట

- గంగమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్త జనం
- ప్రత్యేక అలంకరణలో కటాక్షించిన అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

చౌడేపల్లె: కోరిన కోర్కెలు తీర్చే దైవం పేరొందిన శ్రీ బోయకొండ గంగమ్మ దర్శనార్థం వచ్చిన భక్తులతో బోయకొండ కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి రావడంతో ఎటుచూసినా భక్తులే కనిపించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనానికి అనుమతించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో మేళతాళాల నడుమ తమ మొక్కులు చెల్లించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఒక్క రోజే సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికా రులు వెల్లడించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించారు. అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.



బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

త్రీడీ ఎఫెక్ట్ రొంబా సూపర్ డా..!



చంద్రగిరి కోటలో పుదుకుప్పం తమిళ హైస్కూలు విద్యార్థులు

సత్యవేడు: 'డే..డే.. అంగ్ పార్ డా..అంద పెరియ కాడు పాంబు నంబ మేల్‌కు వరుదు..రొంబా భయమా ఇరుక్కుదు..(రేయ్..రేయ్ అది చూడరా ..ఆ కొండ చిలువ మన మీదకు వస్తోంది.. నాకు చాలా భయంగా ఉంది)..'..అని కొందరు 'అమ్మో! మేలిరిందు పెరియ కల్ నంబు మేల్ వుయ్‌రా మరియక్కీదు.. పోయిడలాం ఇంగిరిందు(ఆ పెద్ద గ్రహ శకలాలు మన మీద పడేలా వస్తున్నాయ్..మనం ఇక్కడ నుంచి వెళ్లిపోదాం..)..త్రీ డీ ఎఫెక్ట్ రొంబా సూపర్ డా ..(త్రీడీ ఎఫెక్ట్ భలే ఉన్నాయ్ రా)' ఇదీ మండలంలోని పుదుకుప్పం తమిళ మీడియం హైస్కూలు విద్యార్థినీ విద్యార్థుల్లో ఒకింత భయం, ఆనందం, ఏదో కొత్త లోకంలో విహరిస్తున్నట్టు..ఊపిరి సలపనివ్వని ఉద్వేగంతో ఊగిపోయారు. ఈ స్కూలు నుంచి తొలిసారి 75మంది విద్యార్థినీ విద్యార్థులను ప్రత్యేక బస్సులో విజ్ఞాన విహారయాత్రకు తిరుపతి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు టీచర్లు తీసుకెళ్లారు. తొలుత తిరుపతి కలెక్టరేట్, ఆ తర్వాత చంద్రగిరి కోట, జూపార్క్, తిరుపతిలోని సైన్స్ సెంటర్, ఇస్కాన్ మందిరాన్ని సందర్శించారు. ఆయా ప్రాంతాల గురించి టీచర్లు వారికి వివరించారు. జూపార్క్‌లో రకరకాల వన్యప్రాణులను ప్రత్యక్షంగా చూసి కేరింతలు కొట్టారు. ఇవంతా ఒక ఎత్తైతే, సైన్స్‌సెంటర్ మినీ ఆడిటోరియంలో పది నిమిషాల నిడివితో 'అనిమల్ ప్లానెట్' త్రీడీ లఘు చిత్రం చూడడం వారికి సరికొత్త అనుభూతి నిచ్చింది. త్రీ డీ కళ్లద్దాల ఎఫెక్ట్ వారిని వన్యప్రాణుల మధ్య సంచరిస్తున్నట్టు, గ్రహాంతరయానం చేసినట్టు అనుభూతికి గురై ఉద్వేగంతో తమ విద్యార్థులు కేరింతలు కొట్టారని ఇంగ్లిష్ టీచర్ జగదీష్ చెప్పారు. పట్నం చూడని తమిళనాడు సరిహద్దు మారుమూల ప్రాంతాల విద్యార్థులకు విజ్ఞాన విహారయాత్ర మధురానుభూతులు మిగిల్చింది. విహారయాత్రలో టీచర్లు శివ, ఏకాంబరం, మునిబాల, ఆంథోని, వ్యాయామోపాధ్యాయురాలు కె.గ్రేస్‌ప్రతిమ పాల్గొన్నారు.